సాక్షి
ఎన్టీఆర్ జిల్లా




శనివారం, 8, మార్చి, 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహరి (ఆది)
విజయవాడ	6.21	5.02
మచిలీపట్నం	6.20	5.01

వందే వనితరం

సమాజానికి నగిషీలుగా మారుతున్న మహిళామణులు



అందం, అభినయం, అణకువ ఒకప్పటి మహిళకు నిర్వచనం.. పరిణతి, పరిపక్వత, పరాక్రమం నేటి మహిళ సొంతం.. ఆమె ఆకాశంలో సగం కాదు.. ఇప్పుడు ఆమే ఆకాశం.. 'ఇందుగలరు.. అందులేర'ని సందేహం లేకుండా అన్ని రంగాల్లో విజయకేతనం ఎగురవేస్తున్నారు. ఆత్మవిశ్వాసాన్ని ఆభరణంగా మలచుకొని.. విభిన్న వేదికలపై 'వనిత'ర సాధ్యులమని చాటి చెబుతున్నారు. సర్పంచి నుంచి రాష్ట్రపతి వరకూ.. ఉపాధ్యాయ ఉద్యోగాల నుంచి దేశాన్ని రక్షించే త్రివిధ దళాల వరకూ ప్రతి చోట పురుషులకు దీటుగా సత్తా చాటుతున్నారు. అన్నింటా తెగువ చూపుతూ సమాజానికి నగిషీలుగా మారుతున్నారు. 'ఇంతి'ంతై.. విశ్వమంతై అన్నట్లుగా జగతి ప్రగతికి మేము సైతం అంటూ నడుం బిగిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మగువల మనోగతం మీ కోసం..

మగపిల్లలతో సమానంగా చూడాలి..



సమాజం మగపిల్లలతో పాటుగా ఆడపిల్లలను సమానంగా చూడాలి. ఎంత అభివృద్ధి సాధించినా ఇంకా వివక్ష కొంత కొనసాగుతోంది. మహిళలు విద్యావంతులైనప్పుడే సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది. ఆడపిల్లలను వారి తల్లిదండ్రులు చదివించటంతో పాటుగా సమాజంలో తిరగటానికి అవకాశం ఇవ్వాలి. తద్వారా కెరీర్‌పై అవగాహన పెరుగుతుంది. అలాగే ప్రేమ, వివాహం మాత్రమే జీవితం కాదు. తమకాళ్లపై తాము నిలబడే దిశగా మహిళలు కృషి చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి ప్రయత్నించాలి.

– ఆచార్య ఎస్. ఉషా, రిజిస్ట్రార్ కృష్ణా విశ్వవిద్యాలయం

నా వంతు సేవ చేస్తా..



ఉన్నత స్థానంలో ఉద్యోగం చేయటం వల్ల మహిళలకు నా వంతు సాయం చేసే అవకాశం దక్కింది. కష్టపడి చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో కొంతకాలం పనిచేశా. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్‌శాఖలో పనిచేయటం వల్ల మహిళల స్థితిగతులను, ఆయా పరిస్థితులను అర్థం చేసుకునే అవకాశం నాకు లభించింది. మహిళలకు నా వంతు సహాయ, సహకారాలు అందిస్తా.

– షేక్ అఫ్రపున్నీసా బేగం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ, కంచికచర్ల

'వనిత'ర సాధ్యం.. ఈ ఘనత



అవార్డుతో జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక

గుడ్లవల్లేరు: దేశ చరిత్రలో అరుదైన పురస్కారం ఇటీవల కృష్ణాజిల్లా పరిషత్‌కు లభించింది. జెడ్పీ ఎంతో పారదర్శకంగా పరిపాలన సాగించిందని చెప్పేందుకు ఐసీఏఐ ఇచ్చిన ఈ అవార్డు నిదర్శనంగా నిలిచింది. ఈ అవార్డు పొందడంలో జెడ్పీ చైర్ పర్సన్‌గా ఉప్పాల హారిక కృషి ఎంతో ఉంది. భారతదేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వెరసి 778 జిల్లాలు ఉన్నాయి. ఈ జాతీయ అవార్డును ఇంతవరకు దేశంలో ఏ జిల్లా పరిషత్‌కు ఇవ్వలేదు. 2023 ఆర్థిక సంవత్సరం కింద జిల్లా పరిషత్‌కు ఆర్థిక నివేదికలను ఉత్తమంగా నిర్వహించినందుకు గాను కేంద్ర స్థాయిలో ఈ అవార్డు వచ్చింది. ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) వారు ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్‌కు అరుదైన ఉత్తమ జాతీయ పురస్కారాన్ని ఇచ్చింది. గత నెల ఒకటో తేదీన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము దంపతులు ఢిల్లీలోని కేంద్ర న్యాయ శాఖామంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

పాలనలో రాణింపు

ఆదర్శ మహిళా సర్పంచ్‌గా కోటమ్మ



జి.కొండూరు: పురుషులతో సమానంగా మహిళలు రాజకీయాలలో రాణించగలరని భావించి రాజకీయాలలో మహిళలకు యాభైశాతం రిజర్వేషన్‌ను అమలు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలు సాకారమవుతున్నాయి. అవకాశాన్ని అందిపుచ్చుకొని ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండల పరిధి పొందుగల గ్రామ పంచాయతీ నుంచి మొదటి మహిళా సర్పంచ్‌గా ఎన్నికైన గుగులోతు కోటమ్మ విభిన్నమైన ప్రణాళికతో పొందుగలను ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలిపి కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డును అందుకున్నారు. సర్పంచ్ కోటమ్మ చదివింది పదో తరగతి. ఏడు ఓట్ల మెజారిటీతో మహిళా సర్పంచ్‌గా గెలుపొందారు. తనకి ఓటు వేసిన వారే కాదు.. ఓటు వేయని వారికి కూడా తాను సర్పంచ్‌ననే భావనతో ఎటువంటి వివక్షకు తావులేకుండా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేశారు. గ్రామ పంచాయతీలో లేబర్ కాంట్రాక్టరుగా, గుమాస్తాగా పని చేసిన తన భర్త అనుభవాన్ని కూడగట్టుకొని, రాజకీయాలకతీతంగా నిధుల లభ్యతను అందిపుచ్చుకొని, ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చి దిద్దడంలో విజయం సాధించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక మహిళగా రాజకీయాలలో పురుషుల కంటే తామేమీ తక్కువ కాదని నిరూపించిన పొందుగల సర్పంచ్ గుగులోతు కోటమ్మకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

అర్చకత్వానికి అంకితం



అర్చక వృత్తిలో కొనసాగుతున్న విజయలక్ష్మి

ఘంటసాల: మహిళలు అన్ని రంగాలలో ముందుంటూ వారసత్వాన్ని, కుటుంబ బాధ్యతలను స్వీకరించడంలో చాలా దృఢ నిశ్చయంతో కొనసాగుతున్నారు అనడానికి నిదర్శనం ఘంటసాల విజయలక్ష్మి, ఆమె సోదరీమణులు లక్ష్మి, మాధవీలత. ఘంటసాలలోని శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, శ్రీ బాల పార్వతీ సమేత జలధీశ్వరస్వామి దేవాలయాల్లో శతాబ్దాలుగా వంశపారంపర్య అర్చకత్వం కొనసాగుతోంది. ఈ పరంపరలో శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు ఘంటసాల వెంకటేశ్వరరావుకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. వారు ఉన్నత విద్యనభ్యసించారు. ఆయన తదనంతరం కుటుంబంలో పురుషులు లేకపోవడంతో ఆడ పిల్లలు తండ్రి వారసత్వాన్ని కొనసాగించడానికి ముందుకు వచ్చారు. 1981లో ఘంటసాల వెంకటేశ్వరరావు కాలం చేయగా.. వారి కుమార్తెలు అర్చకత్వ బాధ్యతలు చేపట్టారు. వీరిలో ముఖ్యంగా ఘంటసాల విజయలక్ష్మి పోస్టు గ్రాడ్యుయేషన్, బీఈడీ చేసినప్పటికీ ఆ రంగాన్ని వదిలి అర్చకత్వ పరీక్షలలో ఉత్తీర్ణురాలై, అవివాహితగా ఉండి తన జీవితాన్ని సంపూర్ణంగా అర్చకత్వానికి అంకితం చేశారు. శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంతో పాటు సుమారు ఏడేళ్లు శ్రీ జలధీశ్వర స్వామి దేవాలయంలో కూడా విజయలక్ష్మి అర్చకత్వం చేశారు. ఈమెకు వారి సోదరిలు లక్ష్మి, మాధవీలతలు కూడా సహకారం అందించే వారు. ఘంటసాల చుట్టు పక్కల ప్రాంతాల్లో శుభకార్యాలు కూడా వీరే చేయించడం ఓ ప్రత్యేకత.

ఆర్థిక స్వావలంబన సాధించాలి..



ఆడపిల్లలకు చదువెందుకు అన్న వ్యవస్థ నుంచి చాలా ముందడుగు వేశాం. సావిత్రిబాయి పూలే, అంబేడ్కర్ వంటి వ్యక్తుల కృషి వల్ల మహిళలు విద్యారంగంలో అడుగులు వేస్తున్నారు. అయితే కనీసం డిగ్రీ చదివితేనే అది మహిళలకు అండగా ఉంటుంది. చాలా మంది డిగ్రీ లోపే చదువును ఆపేస్తున్నారు. వారి తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేసేస్తున్నారు. అది మారాలి. జీవితంలో ఏ కష్టమొచ్చినా నిలదొక్కుకోవాలంటే ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు అడుగులు వేయాలి. అందుకు కనీసం డిగ్రీ చేతిలో ఉంటే ఆ ధైర్యం వేరుగా ఉంటుంది.

– డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల

మా శక్తి సామర్థ్యాలకు గుర్తింపు..



సమాజంలో మహిళలను ఎవరైతే అణగారిన వారిగా చూశారో వారే నేటి సమాజంలో మహిళల శక్తి సామర్థ్యాల గురించి తెలుసుకున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు సముచిత ప్రాధాన్యం లభిస్తోంది. ఉన్న సదుపాయాలను మహిళలు అందరూ అందిపుచ్చుకోవాలి. సమాజంలో మంచి గుర్తింపు పొందాలి. నా తల్లిదండ్రుల సహకారంతో ఉద్యోగం చేస్తున్నా.

– వేల్పుల రమాదేవి, ఉపాధిహామీ పథకం ఏపీఓ, కంచికచర్ల

ఆకాశమే హద్దుగా..



మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్నారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో విజయం సాధిస్తున్నారు. ఆకాశమే హద్దుగా మహిళలు దూసుకుపోతున్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. చట్ట సభల్లోనూ అత్యధిక సీట్లు మహిళలు విజయం సాధిస్తున్నారు. అనేక నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు ప్రాధాన్యం పెరిగింది. విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో అనేక మంది మహిళలు కార్పొరేటర్లుగా గెలిచారు. రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు సైతం చిన్న వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకొని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ప్రధానంగా మహిళలు విద్యావంతులైతే ఆ కుటుంబం మంచి ఉన్నతిని సాధిస్తుంది. ప్రతి కుటుంబం ఆడపిల్లలకు ఉన్నత చదువులు చదివించేందుకు కృషి చేయాలి.

– రాయన భాగ్యలక్ష్మి, మేయర్, విజయవాడ నగర పాలక సంస్థ

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యుని సేవలో కృష్ణా కలెక్టర్



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగ పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట మచిలీపట్నం ఆర్డీవో కె. స్వాతి, స్థానిక ఎస్ఐ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేలిన ఫ్రిడ్జ్.. వంటింటి సామగ్రి ధ్వంసం




మైలవరం: వంటింట్లో ఫ్రిడ్జ్ పేలి సామాన్లు ధ్వంసం అయిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం పూరగుట్టలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పూరగుట్ట గ్రామానికి చెందిన మరీదు నిరంజన్‌రావు, రమాదేవి దంపతులు కూలి పనులు చేసుకుని జీవిస్తుంటారు. గురువారం రాత్రి వారు బెడ్ రూమ్‌లో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున వంట గదిలోని ఫ్రిడ్జ్ ఒక్కసారిగా పేలిపోయింది. ఆ పేలుడు ధాటికి ఇంటి తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. వంట గదిలోని సామాన్లు చెల్లాచెదురుగా పడ్డాయి. దంపతులు బెడ్‌రూమ్‌లో పడుకుని ఉండటం, వంటగదిలో గ్యాస్ సిలిండర్ ఉన్నా అది పేలక పోవడంతో ఎటువంటి అపాయం జరగలేదు. ఫ్రిడ్జ్ పేలుడు శబ్దానికి చుట్టు పక్కల వారు భయాందోళనకు గురయ్యారు. పేలిన శబ్దం అర కిలోమీటరు వరకు వినిపించిందని స్థానికులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో నీతి అయోగ్ సభ్యుడు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన విజయ్‌కుమార్ సరస్వత్‌ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలకగా, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు విజయ్‌కుమార్ సరస్వత్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ ముత్యాలంపాడుకు చెందిన గొట్టిముక్కల సత్యనారాయణరాజు కుటుంబం రూ. 1,11,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

నీరు అందక.. కన్నీరు ఇంకక..

సాగర్ జలాలు రాక ఎండుతున్న పంటలు

- 2, 3 జోన్లకు సాగునీటి సమస్య
- పొట్టదశలో ఉన్న వరికి నీరులేక ఇబ్బందులు
- మేజర్లకు నీరు వదలాలని రైతుల వినతి



నీరు పారక చెట్లు చేమలతో నిండిపోయిన తిరువూరు మేజర్ సాగర్ కాలువ

తిరువూరు: నాగార్జునసాగర్ ఎడమ కాలువ 2, 3 జోన్ల పరిధిలోని వరి పొలాలు సాగు నీరందక ఎండిపోతున్నాయి. తిరువూరు, విస్సన్నపేట, నూజివీడు, మైలవరం ప్రాంతాల్లో 54వేల ఎకరాలు సాగర్ ఆయకట్టు పరిధిలో ఉండగా, దాళ్వా వరినాట్లు వేయక ముందు వారం రోజుల పాటు 2, 3 జోన్లలో సాగర్ నీరు వదిలారు. అప్పట్లో పంటల సాగు ప్రారంభ దశలో ఉన్నందున నీటి అవసరం అంతగా లేదు. మళ్లీ ఫిబ్రవరి, మార్చి నెలల్లో సాగర్ జలాలు వస్తాయని రైతులు ఆశించారు. గత ప్రభుత్వంలో దాళ్వా సాగుకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా సాగర్ అధికారులు తెలంగాణలోని సాగర్ చీఫ్ ఇంజినీర్‌ను సంప్రదించి కాలువలకు నీరందించేవారు.

ఎండుతున్న పొలాలు..

పొట్టదశలో, ఈనే దశలో ఉన్న వరిపొలాలకు ప్రస్తుతం సాగునీరు సమృద్ధిగా అందించాల్సి ఉండగా, చెరువుల్లో అరకొరగా నీరు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి కొరతతో వరి దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, కనీసం నాలుగు తడులకైనా నీరందించాలని రైతులు కోరుతున్నారు. తిరువూరు డివిజన్లోని ఏకొండూరు, విస్సన్నపేట మండలాల్లో, తిరువూరు మండలంలోని అక్కపాలెం, వావిలాల, రాజుగూడెం, ఎర్రమాడు, పెద్దవరం, ముష్టికుంట్ల, ఎరుకోపాడు, కొమ్మిరెడ్డిపల్లి, వామకుంట్ల గ్రామాల్లో సాగునీటి కొరత తీవ్రంగా ఉంది.

మేజర్లకు నీరందించాలి..

సాగర్ 2, 3 జోన్ల పరిధిలోని మేజరు కాలువలకు వెంటనే సాగర్ జలాలు విడుదల చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అసలే వేసవిని తలపిస్తున్న ఎండలతో వరి పైర్లు ఎండిపోతున్నందున చెరువులకు సాగర్ జలాలు నింపి సాగునీటి కొరత తీర్చాలని కోరుతున్నారు.

త్వరలో నీరు వదిలే అవకాశం

నాగార్జునసాగర్ మైలవరం బ్రాంచి కాలువకు నీరు వదిలితే 2, 3 జోన్లలోని మేజర్లకు సాగునీటి సమస్య తీరుతుంది. త్వరలోనే సాగర్ జలాలు ఈ మేజర్లకు వదిలే అవకాశం ఉంది. ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లోనే సాగర్ జలాలు సరఫరా చేస్తున్నారు.

– సునీత, ఎన్ఎస్‌పీ ఏఈ, తిరువూరు

మహిళలపై వివక్ష, సవాళ్లపై చర్చ

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్యానల్ డిస్కషన్ జరిగింది. 'అదృశ్య అవరోధాలను ఛేదించడం – మహిళల నాయకత్వం – సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వి. అనిత, సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. మహిళలు నాయకత్వ స్థాయికి ఎదగడంలో ఎదుర్కొనే సవాళ్ల, అవరోధాలు, వివక్షను అధిగమించే మార్గాల గురించి చర్చించారు.

కదులుతున్న డొంక!

దుర్గమ్మ చీరల స్కామ్‌లో విచారణ చేపట్టిన ప్రత్యేక కమిటీ



ప్రత్యేక కమిటీ కోరిన రికార్డులను తీసువెళ్తున్న ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో చీరల స్కామ్‌పై శుక్రవారం ప్రత్యేక కమిటీ విచారణ చేపట్టింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం 5వ అంతస్తులోని చీరల విభాగంలో దేవదాయ శాఖ గుంటూరు డెప్యూటీ కమిషనర్ కేబీ రావు పర్యవేక్షణలో మొత్తం ముగ్గురు ఏసీలు విచారణ చేపట్టారు. దేవస్థాన పరిపాలనా విభాగం, లీజెస్ సెక్షన్‌తో పాటు చీరల విభాగానికి చెందిన ఉద్యోగులు ప్రత్యేక కమిటీ బృందం ముందు హాజరయ్యారు. చీరల స్కామ్ జరిగినప్పటి రికార్డులను ఇవ్వాలని వారు కోరగా, వాటితో పాటు తాను గతంలో చేసిన విచారణ తాలుకూ రిపోర్టును ఏఈవో సుధారాణి ప్రత్యేక కమిటీకి అందజేశారు.

అసలు విషయం ఏమిటంటే..

2018 నుంచి 2019 వరకు చీరల వ్యవహారంలో గోల్‌మాల్ జరిగినట్లు గతంలోనే గుర్తించారు. మొత్తం రూ. 2కోట్ల విలువైన 33,686 చీరలు మాయం కాగా వాటి స్థానంలో నాసిరకం, నాణ్యత లేని చీరలను ఉంచినట్లు గుర్తించారు. అయితే చీరల స్కామ్ జరిగినప్పుడు ఎవరెవరూ ఆ విభాగంలో విధులు నిర్వర్తించారు.. ఆ తర్వాత ఎవరు బాధ్యతలు తీసుకున్నారనే దానిపై దేవస్థాన పరిపాలనా విభాగం నుంచి రికార్డులను తెప్పించుకుని కమిటీ పర్యవేక్షించినట్లు తెలుస్తోంది. శుక్రవారం జరిగిన విచారణలో చీరల విభాగంలో విధులు నిర్వర్తించిన పలువురు ఉద్యోగులు ప్రత్యేక కమిటీ ముందు హాజరై వివరాలను వెల్లడించారు. సెక్షన్ బాధ్యతలు తమపై ఉన్నా.. భక్తులు సమర్పించిన చీరలు, కౌంటర్‌లో అమ్మకాలు, చీరల నిల్వ వంటి అంశాలన్నీ గుమాస్తాల పర్యవేక్షణలో జరిగాయని తెలియజేశారు. శనివారం కూడా ప్రత్యేక కమిటీ విచారణ చేపట్టే అవకాశాలున్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

అధికారి మెప్పు కోసమేనా!

2018 నుంచి 2019ల మధ్య తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా, ఆ సమయంలో సుబ్రహ్మణ్యం ఉన్నతాధికారుల మెప్పు కోసమే చీరలను గోల్‌మాల్ చేసినట్లు అప్పట్లో దుర్గగుడిలో ప్రచారం జరిగింది. కొంత మంది అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులకు భారీ ఖరీదైన పట్టు చీరలను సమర్పించి, వాటి స్థానంలో నాసిరకం, తక్కువ రేటు ఉన్న చీరలను ఉంచినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రత్యేక కమిటీ ముందుకు 'ఆ ముగ్గురు'!

దుర్గమ్మ చీరల విభాగంలో 2018 నుంచి 2023 వరకు బాధ్యతలు నిర్వర్తించిన వారిలో సుబ్రహ్మణ్యం, చెన్నకేశవరావు, రమేష్ కీలకంగా ఉన్నట్లు గుర్తించారు. 2018 నుంచి 2019 వరకు చీరల వ్యవహారంలో గోల్‌మాల్ జరగగా, ఆ సమయంలో సుబ్రహ్మణ్యం విధుల్లో ఉన్నారు. ఆ తర్వాత చీరల విభాగానికి వచ్చిన మిగిలిన వారు పాత రికార్డులను పట్టించుకోకుండా, తాము బాధ్యతలు స్వీకరించిన తర్వాత వచ్చిన చీరల వివరాలను మాత్రమే రికార్డులలో పొందుపరిచారు. తాజాగా ప్రత్యేక కమిటీ ఆ ముగ్గురు ఉద్యోగులను విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చీరల గోల్‌మాల్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన సుబ్రహ్మణ్యం ప్రస్తుతం కూటమి నేతల పంచన చేరారు. కూటమి మంత్రి చేత మాట్లాడించి ప్రత్యేక కమిటీ ముందు హాజరు కాకుండా ఉండేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేనకు చెందిన ఓ మంత్రి సాయంతో ఈ వ్యవహారం నుంచి బయటపడాలని చూస్తున్నట్లు సమాచారం.

బుడమేరు డైవర్షన్ కెనాల్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్



వెలగలేరు వద్ద బుడమేరుపై ఉన్న హెడ్ రెగ్యులేటర్ గేట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు: గత ఏడాది ఆగస్టులో బుడమేరుకు వచ్చిన వరదల కారణంగా కవులూరు గ్రామ శివారులోని బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు గండ్లు పడిన ప్రాంతాన్ని, వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 6వ తేదీన సాక్షి ప్రచురించిన 'బుడమేరకు పొంచి ఉన్న కడగండ్లు' కథనానికి స్పందించి ఆయన ఈ పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మొదట డైవర్షన్ కెనాల్‌కు గండ్లు పడి పూడ్చిన ప్రదేశంలో ఊట వస్తున్న ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైఫన్ల వద్ద కట్ట బలోపేతంపై అధికారులతో చర్చించారు. అనంతరం వెలగలేరు హెడ్‌రెగ్యులేటర్ వద్ద గేట్లను పరిశీలించారు. సమస్య ఉన్న గేట్లకు చేపట్టవలసిన మరమ్మతులపై ఆరా తీశారు. వరదల కారణంగా బుడమేరు, పులివాగుతో పాటు పలు వాగులకు పడిన గండ్లు, మేజర్, మైనర్ ఇరిగేషన్ చెరువులు వాటికి పడిన గండ్లపై అధికారులు, రైతులతో చర్చించారు. రైతులకు ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిన నేపథ్యంలో అనుమతి రాగానే పనులు ప్రారంభించి వర్షాకాలంలోపు పనులను పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో శుక్రవారం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ బి.ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. నెల రోజుల్లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెకు వెనుకాడబోమన్నారు. అనంతరం డీఎంఏ అధికారులు ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ధర్నాలో ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ బి.ముత్యాలరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి, కో కన్వీనర్ ఎస్.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

భక్త జన జాతర



అనిగండ్లపాడులో అమ్మవారి పుట్టినింటి నుంచి తీసుకు వస్తున్న పసుపు-కుంకుమల బండి(ఫైల్)



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

- ఐదు రోజులు జరిగే ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- మార్చి 14 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- మార్చి 17 న అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమ బండ్ల రాక

పెనుగంచిప్రోలు: రాష్ట్ర ప్రజలతో విశేష పూజలందుకుంటున్న పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు మార్చి 14 నుంచి 18 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. తిరునాళ్ల మహోత్సవాలు జరిగే ఐదు రోజులు, ఒక్కో రోజు ఒక్కో ఉత్సవం కనుల పండువగా జరగనుంది. ఉత్సవాల్లో అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడు గ్రామం నుంచి పసుపు-కుంకుమల బండ్లు రాక ప్రధాన ఘట్టంగా ఉంటుంది. తిరునాళ్లకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వస్తారు.

ఇవీ ఏర్పాట్లు...

మునేరులో జల్లు స్నానాలు, పలు చోట్ల భక్తుల సౌకర్యార్థం చేతి పంపులు, శుద్ధి చేసిన తాగు నీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు వసతి కోసం పలుచోట్ల షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు.

అఖండ జ్యోతి స్థాపనతో తిరునాళ్ల ప్రారంభం

చిన్న తిరునాళ్లలో మొదటి రోజు మార్చి 14 న ఉదయం 6-02 గంటలకు అఖండజ్యోతి స్థాపనతో ఉత్సవాలు మొదలవుతాయి. వేలాదిగా భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో మొక్కులు తీర్చుకుంటారు. నిత్య కల్యాణ మూర్తులకు అభిషేకం ఉంటాయి.

రెండవ రోజు గ్రామోత్సవం

తిరునాళ్లలో రెండవ రోజు మార్చి 15 న రాత్రి 6-56 గంటలకు ఉత్సవమూర్తులను రథంపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవం (గ్రామోత్సవం) నిర్వహిస్తారు. భక్తులు వేలాదిగా పాల్గొంటారు.

మూడవ రోజు దివ్య ప్రభోత్సవం

మూడవ రోజు మార్చి 16 న రాత్రి 9-05 గంటలకు దివ్య ప్రభోత్సవం వైభవంగా జరగనుంది. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న ఈ ఉత్సవంలో సుమారు 90 అడుగుల దివ్యప్రభపై ఉత్సవమూర్తులను ఉంచి ప్రభను ఎడ్లు లాగుతూ ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయిస్తారు. ఈ అపురూప దృశ్యాన్ని చూడటానికి మండల ప్రజలే కాక పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

నాల్గవరోజు అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమలు

చిన్న తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమ బండ్లు తిరునాళ్ల నాల్గవ రోజున మార్చి 17న అనిగండ్లపాడు గ్రామం నుంచి సాయంత్రం 4-53 గంటలకు ప్రారంభం కానున్నాయి. అమ్మవారి పుట్టింటి వంశీకులు కొల్లా శ్రీనివాసరావు ఇంటి నుంచి ఏటా పసుపు కుంకుమలు బండ్లపై తీసుకు రావటం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి చెందిన వారు వందల బండ్లతో పసుపు-కుంకుమ బండి వెంట పెనుగంచిప్రోలు ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తారు.

ఐదవ రోజు భక్తుల బోనాల సమర్పణ

ఐదవరోజు మార్చి 18 న ఉదయం 5-30 గంటలకు భక్తులు బోనాల సమర్పణతో చిన్న తిరునాళ్ల ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి



చిన్న తిరునాళ్ల ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పించేందుకు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు, ప్రసాదాల కౌంటర్లు, బస్టాండ్ ఏర్పాట్లు ఆలయ ఇంజినీరింగ్ అధికారుల ద్వారా చేస్తున్నాం. మునేరులో షవర్‌బాత్‌లు, తలనీలాలు తీసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరగనున్నాయి.

–బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఆలయ ఈఓ

ఉత్సవాల విజయవంతానికి సహకరించాలి



అమ్మవారి చిన్నతిరునాళ్ల మహోత్సవాన్ని భక్తులతో పాటు గ్రామస్తులు, అధికారులు సహకరించి విజయవంతం చేయాలి. తిరునాళ్ల ఐదు రోజుల పాటు ఆలయం వద్ద రాత్రి సమయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం.

–జంగాల శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్

ఎన్టీఆర్ జిల్లాలో నేటి నుంచి పీ4 సర్వే

- క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తయిన శిక్షణ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



పీ4 సర్వేపై వర్చువల్‌గా మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఈ ఏడాది ఉగాది నుంచి శ్రీకారం చుట్టనుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక సర్వే జరుగుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ నోడల్ అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి పీ4 సర్వేపై వర్చువల్‌గా వర్క్‌షాప్ నిర్వహించారు. పీ4 సర్వే తీరుతెన్నులను పీపీటీ ద్వారా వివరించారు. సర్వేకు సంబంధించి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తయిందన్నారు. కుటుంబ వివరాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులకు సంబంధించి మొత్తం 27 ప్రశ్నల ద్వారా డేటాను సేకరిస్తారన్నారు. సర్వే అనంతరం మార్చి 21న సమాచార జాబితాలను గ్రామసభలో ప్రదర్శిస్తారన్నారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు అదనంగా సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పీ4 విధానం లక్ష్యమని వివరించారు. కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. అవసరమైతే పథకాల లబ్ధిదారుల జాబితాలో చేర్చడమే తప్ప తొలగించడం జరగదన్నారు. సర్వే ప్రయోజనాలను కుటుంబాలకు క్షుణ్ణంగా వివరించి, కచ్చితమైన డేటాను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్లో పొందుపరిచేందుకు ఎన్యూమరేట్లు కృషి చేయాలన్నారు. సర్వే ప్రగతిని డ్యాష్‌బోర్డు ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. సర్వే విజయవంతానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్య కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కొమరవోలులో పర్యటించిన నారా భువనేశ్వరి



ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి

కొమరవోలు(పామర్రు): గతంలో తాను దత్తత తీసుకున్న గ్రామమైన పామర్రు మండలం కొమరవోలు గ్రామంలో ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్, సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం పర్యటించారు. గ్రామ పొలిమేరలో ఆమెకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏపీ ఎస్ డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత తన తల్లిదండ్రులు ఎన్టీఆర్, బసవ తారకం విగ్రహాలకు ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని శివాలయంలో ఆమె ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దిరిశం రత్నకుమారి గ్రామ సమస్యలను తెలియజేశారు. గ్రామంలోని శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, గ్రామంలో మూడు కిలోమీటర్ల మేర సీసీ రహదార్లు ఏర్పాటు చేయాలని, ఎస్సీ కాలనీ అభివృద్ధి పర్చాలని కోరారు. గ్రామస్తులు వారి వారి సమస్యలను ఆమెకు తెలియజేశారు. భువనేశ్వరి మాట్లాడుతూ గ్రామ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఆ పార్టీ నేతలు కాట్రగడ్డ రమేష్‌బాబు, గొట్టిపాటి లక్ష్మీదాసు, కాకరాల హరిబాబు, గ్రామ కార్యదర్శి స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రధాన శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి సూచన



గోపవరపుగూడెంలో మామిడి పూత పరిశీలిస్తున్న డాక్టర్ కనకమహాలక్ష్మి, జ్యోతి

గన్నవరం రూరల్: మామిడి తోటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని నూజివీడు మామిడి పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.కనకమహాలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో శుక్రవారం ఆమె జిల్లా ఉద్యానవన అధికారి జె.జ్యోతితో కలసి మామిడి తోటలు పరిశీలించారు. అనంతరం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని తోటలలో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు గమనించామన్నారు. ఈ పురుగులు, తెగుళ్ల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ లేదా సాఫ్ 2జీ హెక్సకోనజోల్ 2జీ లేదా యాన్‌ట్రాకోల్ 2జీ లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు. మామిడి మొక్క వయస్సు, భూమి తేమ శాతం బట్టి నీరు పారించాలన్నారు. పిందెలు పసుపు రంగుకు మారి రాలిపోతుంటే ప్లానోఫిక్స్ 0.2 ఎంఎల్ లీటర్ నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ మామిడి రైతులకు కవర్‌లు అందుబాటులో 50 శాతం రాయితీపై ఇస్తున్నామని చెప్పారు. కావాల్సిన రైతులు ఉద్యానవన సిబ్బందిని సంప్రదించాలన్నారు. మండల హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్, ఉద్యానవన సహాయకులు వి.దీక్ష, కౌశిక్, భవాని, మాజీ సహకార బ్యాంకు అధ్యక్షుడు నల్లూరి కోటేశ్వరరావు, కొత్తలంక వెంకట్రామయ్య, రైతులు పాల్గొన్నారు.

అడవి పంది ఉచ్చులో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రాజు

గౌరవరం(జగ్గయ్యపేట): అడవి పంది కోసం పెట్టిన ఉచ్చులో పడి విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన కత్తుల సుధాకర్ వియ్యంకుడు కంచికచర్లకు చెందిన గొర్రెపాటి రాజు (44) గురువారం గౌరవరం వచ్చాడు. రాత్రి సమయంలో సుధాకర్ మొక్కజొన్న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తుండగా రాజు కూడా ఆయనతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అడవి పందిని పట్టేందుకు విద్యుత్ తీగలతో కూడిన ఉచ్చును ఏర్పాటు చేశారు. అది గమనించని రాజు ఉచ్చులో పడి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అడవిపందులను పట్టేందుకు గత కొంత కాలంగా నందిగామ డీవీఆర్ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మొక్కజొన్న పొలాల్లో ఉచ్చులు పెడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వారిరువురు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నారు.

భార్య పై సుత్తితో దాడి

పెనమలూరు: కానూరులో భార్యపై సుత్తితో దాడి చేసి గాయపర్చటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు మన కల్యాణ మండపం ప్రాంతంలో ఉన్న సామీ అపార్టుమెంట్‌లో పి.లక్ష్మి, భర్త తలుపులు ఇద్దరు పిల్లలతో కలసి ఉంటున్నారు. భర్త అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తుండగా భార్య అపార్టుమెంట్ ఇళ్లల్లో పని చేస్తుంది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త తలుపులు ఆమె ఇంట్లో నిద్రపోతున్న సమయంలో సుత్తితో తలపై కొట్టాడు. భార్య బిగ్గరగా కేకలు వేయగా అపార్టుమెంట్‌లో ఉన్న వారు ఆమెను కాపాడారు. గాయపడిన లక్ష్మిని కానూరులో ఆస్పత్రిలో చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు.

అంతర్ రాష్ట్ర నేరస్తుడు అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ తిలక్, పక్కన సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, చిత్రంలో నిందితులు

జగ్గయ్యపేటఅర్బన్: రాత్రి సమయాలలో దొంగతనాలు చేసే అంతర్ రాష్ట్ర పాత నేరస్తుడిని పేట పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలను (220 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ పి.వెంకటేశ్వర్లుతో కలిసి నందిగామ ఏసీపీ తిలక్ వివరాలు వెల్లడించారు. సీఐ పి.వెంకటేశ్వర్లుకు వచ్చిన పక్కా సమాచారం మేరకు శుక్రవారం పేట మండల పరిధిలోని గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణ రాష్ట్రం పాండురంగాపురం గ్రామానికి చెందిన సంపతి ఉమాప్రసాద్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించి అతని వద్ద నుంచి రూ.20 లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇంటర్ వరకు చదువుకున్న నిందితుడు చిన్ననాటి నుంచే చెడు సావాసాలు చేసేవాడని, తాళం వేసి ఉన్న ఇళ్లలోకి జొరబడి డబ్బు, బంగారాన్ని దొంగతనం చేసి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవాడన్నారు. ఇతనిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో మొత్తం 32 దొంగతనం కేసులు ఉన్నాయని, వీటిలో 25 కేసుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్ పెండింగ్‌లో ఉందని, 12 కేసుల్లో అరెస్ట్ ఎండింగ్‌లో ఉన్నాడన్నారు. గత నెల 19 వ తేదీన జగ్గయ్యపేటలో దొంగతనం చేశాడని, ఆ వస్తువులను నందిగామలో అమ్ముదామని వెళుతుండగా సీఐ వెంకటేశ్వర్లుకు వచ్చిన సమాచారం మేరకు గరికపాడు చెక్‌పోస్టు సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో మరొక నిందితుడు అరెస్ట్...

జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ముత్తవరం గ్రామానికి చెందిన గలంజీపల్లి శేఖర్‌ను అదుపులోకి తీసుకొని విచారించి అతని వద్ద నుంచి 36 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తిలక్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రాజు, వెంకటేశ్వరరావులను, వారి సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు 710 మంది గైర్హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి శుక్రవారం జరిగిన పరీక్షలకు 710 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం మ్యాథ్స్-2ఏ, సివిక్స్-2, బోటనీ -2 పేపర్లకు సంబంధించిన పరీక్షలు జరిగాయి. వీటికి 36,996 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా అందులో 36,286 మంది హాజరయ్యారు. 710 మంది గైర్హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. వొకేషనల్ కోర్సులకు సంబంధించి 1014 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 952 మంది హాజరయ్యారు. 62 మంది గైర్హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. జిల్లాలో శుక్రవారం మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 543 మంది గైర్హాజరు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు శుక్రవారం జిల్లా వ్యాపితంగా 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. వాటిలో 2604 మంది విద్యార్థులను కేటాయించగా 2055 మంది హాజరయ్యారు. 543 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, బీఎస్ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్, ఏపీఎస్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను డీఈవో సుబ్బారావు శుక్రవారం తనిఖీ చేశారు. తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, విజయవాడ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు సందర్శించాయి.

శాటిలైట్ స్టేషన్‌గా రాయనపాడు

- రూ.12.13 కోట్లతో స్టేషన్ ఆధునికీకరణ పనులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో బహుళ అంతస్తుల నిర్మాణం



రాయనపాడు స్టేషన్ నమూనా చిత్రం



స్టేషన్ లోపల జరుగుతున్న ఆధునికీకరణ పనులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఎన్ఎస్‌జీ-5 కేటగిరీ కలిగిన ఈ రైల్వే స్టేషన్ దక్షిణ తీర ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై – బల్లార్షా – నాగ్‌పూర్ – న్యూఢిల్లీ లైన్‌లోని గ్రాండ్ ట్రంక్ మార్గంలో ఉంది. నిత్యం 250 రైళ్లు, 1.40 లక్షల మంది ప్రయాణికులతో విజయవాడ రైల్వేస్టేషన్‌లో అధిక రద్దీ నెలకుంటుండటంతో దీనికి ప్రత్యామ్నాయంగా రాయన పాడు రైల్వే స్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా ఆధునీకరించేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు కొన్ని సాధారణ రైళ్లు మాత్రమే ఆగే ఈ స్టేషన్‌లో భవిష్యత్తులో అన్ని ప్రధాన రైళ్లు కూడా ఆగనున్నాయి. ముఖ్యంగా నాగ్‌పూర్, సికింద్రాబాద్ మార్గం నుంచి వరంగల్ మీదుగా విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా వైపు వెళ్లే అనేక రైళ్లు విజయవాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లకుండా రాయనపాడు మీదుగా దారి మళ్లించనున్నారు. దీంతో విజయవాడ ప్రధాన స్టేషన్‌పై చాలావరకు వత్తిడి తగ్గుతుంది. ఈ కారణంగానే రాయనపాడు రైల్వే స్టేషన్‌ను విజయవాడ బైపాస్ స్టేషన్ అని కూడ పిలుస్తున్నారు.

శాటిలైట్ స్టేషన్‌గా వేగంగా పనులు...

అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీఎస్ఎస్) పథకంలో భాగంగా విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌కు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రాయనపాడు రైల్వే స్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి పర్చేందుకు రైల్వేశాఖ రూ.12.13 కోట్లతో స్టేషన్ పునరాభివృద్ధి పనులు చేపట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో స్టేషన్ పునరాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా ఇప్పటి వరకు 58 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది చివరి కల్లా మిగిలిన పనులను కూడ పూర్తిచేసే దిశగా అధికారులు పనులను వేగవంతం చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేషన్ ఆధునికీకరణ పనులు...

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆంధ్రప్రదేశ్‌లో 53 స్టేషన్‌లలో పునరాభివృద్ధి పనులకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే విజయవాడ డివిజన్‌లో 22 స్టేషన్‌లు ఈ పథకానికి ఎంపిక చేయగా అందులో రాయపాడు స్టేషన్ ఒకటి. ఈ ప్రాజెక్ట్‌లో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆధునిక బహుళ అంతస్తుల స్టేషన్ భవన నిర్మాణాలు, పరిసర ప్రాంతాలలో గ్రీనరీ, ఏసీ, నాన్ ఏసీ వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫాంల పొడిగింపు, ఎస్కలేటర్లు, లిఫ్టుల ఏర్పాటు, ఫుట్ బ్రిడ్జి నిర్మాణాలు, రిజర్వేషన్ కౌంటర్‌లు, ముఖ్యంగా దివ్యాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక ర్యాంపు మార్గాలు, మాడ్యులర్ టాయిలెట్‌ల నిర్మాణాలు చేపట్టనున్నారు. పనులను వేగవంతంగా చేపట్టామని, ఇప్పటివరకు 58 శాతం భౌతిక పనులు పూర్తయ్యాయని, ఈ ఏడాది చివరి నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.